# అడవి పూవు

కనకరాజు భార్య కమల సన్నజాజిపువ్వులా నాజుగ్గా సన్నంగా ఉండేది. ఎప్పుడూ వాడని పుష్పంలా నున్న ఆమె మోమును మనసారా ఆమె నిద్రపోతున్నా కూడా చూస్తూ మురిసి పోయేవాడు. ఆ దరహాసం నీలి ఆకాశంలో చవితి చందమామ చిరు నగవులా ఉండేది. హంసల్లాంటి తెల్లని బట్టలు కట్టుకొని, అపూర్వ మైన వయ్యారం ఒలకబోసుకొని ఒక్కొక్క అడుగు వేస్తుంటే, గుప్పెట్లో ఇమిడిపోయేటట్లున్న ఆ నడుమును పట్టుకొని ఆమెను తనవేపు త్రిప్పుకోవడం అలవాటే. నిజం చెప్పి న్యాయంగా ధనా ర్జన చేస్తే మనస్సెంత చల్లగా ఉంటుందో, ఆమెతో కాపురం అలా ఉండేది. రాబడి ఖర్చులు త్రాచులో సరితూగుతున్నట్లు సంసారం సాగించేది. జీవితం నల్లచుక్క పడని తెల్ల కాగితంలా ఉండేది.

చల్లనిగాలి, చిలికిచిలికి గాలివాన అయినట్లు ఒకనాడు కనకరాజు జీవితం భీభత్సం అయిపోయింది. సమ్మోహనంగా

ఉండిన వసంతం గ్రీష్మంగా మారింది. కళ్ళల్లోని ఆశాజ్యోతులు నిరాశతో నీరై పోయాయ్. సంతోషంతో ప్రవహించిన హృదయం దుఃఖంతో చెక్కలైంది. అతను యేది నిత్యం యేది సత్యం అనుకున్నాడో అది మాయా అసత్యం అయిపోయాయ్. కమల చనిపోయి ఆరు నెలలైనా నిన్నా మొన్నా ఆ పిడుగు లాంటి సంఘటన జరిగినట్టుంది. ధైర్యాన్ని గుటకలు మింగి, శోకాన్ని భరించి, ఇద్దరి పాపల్ని ప్రాణ ప్రదంగా చూసుకుంటు న్నాడు. మాటాడిని పుష్పాన్ని కోల్పోయిన అతని మనస్సు, మాటాడని మొగ్గలతో పరిచయాన్ని యేర్పరుచుకుంది. అందుకే కళ్ళవేడుకనిచ్చే పూలతోటను తన బంగళా చుట్టూ సృష్టించుకున్నాడు

ఒక నాటి వేకువఝామున యేదో కలగని తెలివి తెచ్చుకున్న కనకరాజు నిస్పృహను నరకాలని మనసును పూలతోటపై మళ్ళించాడు. తోటలోనికి వచ్చి సిమ్మెంటు దిమ్మపై కూర్చున్నాడు. వికసిస్తున్న మొగ్గలా, విచారం వదులుతున్న మనసులా ఉషస్సు ఉదయిస్తోంది. తన కుటుంబంలోని వ్యక్తుల్లా, అరకరకాల పూల చెట్లతో అతనికి సన్నిహితం ఉంది. ఉదయభానుని రక్తాన్నంతా పీల్చేసి యెరుపు దేరిన మందారాలు సాయంత్రానికల్లా ఆ రక్తాన్నంతా తిరిగి అతనికి అప్పచెప్పి తలలువంచేస్తాయ్, మల్లెల కొల్లలుగా పూసి బంగళా చుట్టు పన్నీరు జల్లుతాయి. బొద్దుగా భీకరంగా పూసిన బొగడలు, ఆకుల్లో అణగి అపూర్వమైన వాసనలను వెదజల్లుతున్న సంపెంగలు, ఝుమ్మని రొదచేసే తుమ్మెదలను ఆహ్వానించే రంగురంగు గులాబులు, ముఖాన్ని పౌడరు వత్తుకొని రాత్రంతా సరసుని కోసం వేచివున్న శోభనాంగిలా నున్న లిల్లీ పూలు— వీటన్నిటి పేర్లు తెలుసు, వీటి అందాలు పరిమళాలు

అతని మనసులో చోటు చేసుకొని మూగ బాసలతో తన దుఃఖాన్ని ఉపశమింప చేస్తున్నాయి.

ఆకాసంలో తోకచుక్కలా ఒక్కసారి తన దృష్టిని తొలిసారి గేటు దగ్గరరేనున్న పేరు తెలియని పూలమొక్క ఆకర్షించింది. పెద్దకాడతో తెల్లగా ఒక పూవు తొలిసారివిడివడింది. ఆకలితోసన్న బడినతల్లిలేని పిల్లలాంటి మొక్కను షికారునకు వెళ్ళినప్పొడుఆరు నెలల క్రితం తెచ్చినాటాడు. సున్నిత మెరుగని రూపుతో మోటు ఆకులతో నున్న అడవి మొక్క అంత అందమైన పూవుతో సింగా రించుకుంటుందని తను వూహించుకోలేదు. అందమైన పువ్వును చూడగానే ఆ పూలమొక్కపై అభిమానం ముందుకొచ్చింది. గబ గబాదగ్గరకెళ్ళి నిల్చొని చెట్టుని ఒకసారి ఆప్యాయంగా తాకబో తుంటే చేతిలో కాఫి కప్పుతో పున్నమ్మ ప్రత్యక్షమైంది. ఇన్నాళ్ళు తను లేచేసరికి బెడ్ కాఫి మంచం ప్రక్కనే బల్లమీదుండేది. ఈ వేళ తను వేగంగా లేచిపోవటం ఈమె తనకు దగ్గరగా రావటంతో పరీక్షగా చూడటం జరిగింది.

రెండేళ్ళ క్రితం ఆఫీసునించి ఇంటికి వచ్చేసరికి ఆకలితో చిక్కి అసహ్యంగా నున్న పిల్ల అగపడింది. ఎవరిని అడక్కుండానే కమల ఆ పిల్ల గాథ చెప్పింది. ఆ పిల్లకు యెవ్వరూలేరట. అడు క్కొనికడుపు నింపుకుంటోంది. పనిచేసుకోరాదా అంటే యెవరిస్తా రని యెదురుప్రశ్న వేసింది. ఆ ప్రశ్నకు సమాధానంగా కమల ఆ పిల్లని పనిగొట్లు చెయ్యడానికీ పెట్టుకుంది. కమల పోయాక ఇంట్లో పని, వంట,పిల్లల కింద సేవ పున్నమ్మే చేసుకుంటోంది. భార్య ఉన్నప్పుడు, పోయినప్పుడు. ఇంతవరకు తనలో ఆమెపై

రజకున్న మోహం ఇంక పున్నమ్మ అంటే తొలి రోజు చూసిన ఆకారమే మనసులో మెసులుతుంది.

ఈ రోజు అడవి పూవు మీద చూపించిన శ్రద్ధే ఆమెవేపు చూసాక కలిగింది. పోషణతో పాటు ప్రమోదమైన వాతావరణం ఆమెను అడవి మొక్కలా యేపుగా బలిష్టంగా పెంచింది. వసుయ ఒళ్ళంతా ప్రాకిపోయింది. ఆమె అవయవాల పొందిక చూసిన కనక రాజు మనసు ఒక్కసారి చలించింది. కాఫి త్రాగుతూ ఆగిఆగి క్రీగంటగా ఆమెవేపు పదేపదే చూసాడు.

ఆమె అక్కడనించి కదిలాక ఆమె వెంటపడాలనీ, ఒకసారి ఆమె కళ్ళల్లోకి దీక్షగా చూడాలనీ, ఆమె చిరునగవు ఒలగబోస్తే తాను యెన్నాళ్ళకు మళ్ళీ నవ్వగలిగానని — ఇలా మనసులో ఆలోచనలతో పాటు ఆక్షేపణలనుకూడా సృష్టించుకున్నాడు చెక్కిన దంతం బొమ్మలాంటి కమలలో మంత్రించిన మోహం ఉండేది కాదు. ఆమె అందం, సంస్కారం అంతా సున్నితమైంది. సిల్కు బట్టలాంటి శరీరం ఆమెది. మగవాడి చూపులను వెనక్కి రాకుండా బంధించగల బలిసిన యవ్వనాన్ని తాకాలనే కోర్కె కమల ఉన్న రోజు నించీ తీరని కోర్కెగా నిలచిపోయింది.

ఏంటో ఈ అడవి పూవు పికపిక మంటూ తోటలోని అన్ని పూలకు దీటంటున్నది. రోజుకు రోజూ అతని ఆందోళన ఆవేశం నల్లమేఘాలు ఫలుముకొని ఢీ కొన్నట్లు మనసులో రగులుకుంటున్నాయి. కమలపోతే మళ్ళి పెళ్ళి చేసుకోనని ఢంకా మీద దెబ్బ కొట్టినట్లు తెలియపర్చిన తన నిర్ణయాన్ని అంతా హర్షించారు.

తన యేకపత్నీవ్రతాన్ని శ్లాఘించారు. కమల లాంటి అపూర్వమైన స్త్రీతో కాపురం చేసినవాడు అలాంటి స్త్రీని మళ్ళీ పొందలేడన్న భావం తనలో పాతుకపోయి ఉండేది. ఇప్పుడు గాలితో పొంగిన రబ్బరు బెలూనులా యవ్వనంతో పొంగిన పున్నమ్మ వేపు దొంగ చూపులు చూస్తుంటే కనకరాజుకు మతిపోతుంది.

ఈ అడవిపూవు యెంతకాలం ఇంత మనోహరంగా చెట్టున ఉంటుంది? రాలిన రాలుతుంది! ఎవరైనా తెంపినా తెంపుతారు. ఏదో తుమ్మెద వాలితే పూవు కాయవుతుంది. కాలం అందాన్ని తెస్తుంది. అందాన్ని మింగుతుంది. చావు పుట్టుకల మధ్యకాలం దైన్యాన్ని కాకుండా ఆనందానికి వినియోగించుకోవటంలో ఉంది మనిషి ప్రజ్ఞ. ఈ ప్రజ్ఞను తను, నలుగురిలో అర్థంలేని గౌరవం తెచ్చుకోవడం కోసం యెందుకు వదులుకోవాలి?

కోరిక బాధించినా, ధర్మం తెలుసుకున్నవాడు కాబట్టి ఇంట్లో నున్న పున్నమ్మను ముట్టుకోలేక పోయారు. అప్పుడప్పుడు మనసు పట్టుతప్పి ఆమె వేపు కళ్ళల్లో నీరుగా మారిన కామంతో మౌనంగా చూసేవాడు! ఆమె చూపులు యెప్పుడూ మిణుకు మిణుకు మనే చుక్కల్లా ఉండేది. చుక్కల వేపు చూసి కవిత్వం అల్లుకునే ప్రేమికునిలా మనసులో అనుభూతులు కలిగేవి. మరికొన్ని రోజులు పోయాక ఆమె వడ్డిస్తోంటే కుదురుగా నున్న చేతులను తాకాలని తాకలేక చిన్న నవ్వు నవ్వితే జవాబు రాలేదు. బాధపడినా ఇంకో సారి వంటింటిలో ఒక్కర్తె ఉంటే దగ్గరకు వెళ్ళాలని రెండు అడుగులు వేస్తే పున్నమ్మ ఇటు వస్తూ యెదురయింది. చేతులు లేచాయి గానీ ఆమె ప్రక్కకు కదిలి పోయింది. తరవాత తోటలో

నికి వచ్చి యేకాంతంగా కూర్చుని గంటల తరబడి తనను తాను విమర్శించుకున్నాడు. నరాల పొంగు తగ్గిన తర్వాత తెలివి తెచ్చుకొని అంతా కల అనుకున్నాడు. పున్నమ్మ తన కళ్ల యెదుట తన కూతురిలా పెరిగింది. కనికరించినా కడతేర్చినా తనే చెయ్యాలి. "దుష్టులు చేసే పాపం సమర్ధుడు చూసి వూరుకుంటే, వాళ్ల పాపంలో తను భాగస్థుడవుతాడని" మహాభారతంలో చదివాడు,

సమర్థుడనుకున్న తనే దుష్టుడైతే పాపం పండిపోతుంది. తెలివి తక్కువ వాడు, మూర్ఖుడు చేసిన మహా పాపాల కంటే తెలివైన వాడు, సమర్ధుడు చేసిన కొద్ది పాపమే హెచ్చుగా పరిగణింపబడుతుంది.

ఈ ధర్మాధర్మ విచక్షణ ఇంకా మనసులో నించి తుడిచిపెట్టకముందే అమరుసటిరోజు ఒక సంఘటన జరిగింది. వేగంగా ఆఫీసునించి వచ్చేశాడు. పున్నమ్మ ఇంకో ఇనుపగుండులా ఉన్న యౌవనునితో కులాసాగా పకపకనవ్వుతూ యేకాంతంగా ఎంతోపరిచయమున్నట్లు మాట్లాడుతోంది. ఆమాటల్లో మోటుహాస్యం విన్నాడు. ఆ కొంటెచూపుల్లో కోరికలు చూసాడు. తిరిగి వెనుకకు బాధతో కదిలిపోయాడు. ఆరాత్రి తిండిదగ్గర ఆమె వేపు చురచుర చూశాడు. ఆచూపుల్లో ఆక్షేపణ, ఈర్ష, నిరసన అంతా వ్యక్తపరిచాడు. ఆమె తొణకలేదు బెణకలేదు. మామూలుగా పనిపాట్లన్నీ చేసుకుంటోంది. ఏదో అందామనుకున్నాడు. మందలిద్దాం మనుకున్నాడు. తనుయేమన్నా ఏదిచేసినా యేదో స్వలాభం తోను, అసూయతోనే చేయటం జరుగుతుంది కానీ ఆమె రక్షకునిగా చెయ్యటం లేదని తర్కించుకోవటం వలన వూరుకున్నాడు. ఆఫీసుకుపోయినా, ఇంట్లో ఈసరికి యేంజరుగు

తుందో వూహించుకునే వాడు. తను కమల నివసించే గదిలో పెళ్ళి ద్దరూ స్వేచ్ఛగా విహరిస్తుంటారని తోచగానే భరించ లేక ఇంటికి వచ్చేసరికి ఆమె యేదో పనిపాట్లు చేసుకుంటోంది. ఎన్ని మాటలు అందామని వచ్చాడో అన్నీ దిగమింగేసాడు. ఇంకో రోజున ఆమె పెరటి వరండాలోనే వాడితో పాటు మాటాడుతోంది. అక్కడికి వెళ్ళడం మర్యాద కాదనుకున్నా చప్పున వెళ్ళాడు. ఆమె నిర్ఘాంత పోయింది, ఏమి మాటాడకండా కోపంగా మొఖం పెట్టి వచ్చేసాడు

ఆక్షణం నించి ఆమె అతని యెదుట పడటానికి జంకుతోంది పువ్వు మీద మంచులా ఆమెకు దిగులు కప్పేసింది. అతను ఇంట్లో ఉండగా ఇదివరకు ఉన్న చనువులేదు, సంతోషం లేదు. చాటు మాటుగా కదులుతోంది. కనకరాజు ఈ మార్పును సహించలేక పోయాడు. ఇదివరకు ఆమె నిర్లక్ష్యంగా వదిలి పెట్టిన యవ్వనం ఎప్పుడూ చిరునవ్వుతో చిందులు తొక్కే పెదాలు, అరమరికలు లేకండా అన్నీ అమర్చి పెట్టే ఆ చనువు-ఇవన్నీ ఇప్పుడు కరవు కాగానే అతను ఇంట్లో ఉండలేక పోయాడు.

ఎన్నాళ్ళై తీరని కోరిక ఎలాగైనా సాధించుకోవాలన్న పట్టు దల హెచ్చయింది తనలో ఎన్నెన్నో ఆలోచనలు కలిగినయ్. ఆమెను ఒకసారి యేదో చేసేస్తే? తన కోరిక ఆమెతో చెప్పితే? ఆమె అందుకు ఒప్పుకుంటే? ఆమె తనను పెళ్ళి చేసుకోడానికి ఒప్పుకుంటే తనకు సంఘంలో ఉన్న మర్యాద అంతా గంగలో కలిసిపోతుంది. "నీకూ నాకు జోడి యెలా కుదురుతుంది బాబూ. నీ కూతురులాంటిదాన్ని" అంటేతనకుజవాబు చెప్పటానికిమాటలురావు.

అతనికి రోజుకు రోజు వికారం హెచ్చవుతోంది. తనింకా యౌవనంలోనే ఉన్నాడు.తనలో ఉన్నసున్నితం, సంస్కారం, ఉగ్గులు తేరిన తన జుత్తు, పుటం వేసిన బంగారం లాంటి తన శరీరచ్ఛాయ, ఆడది చూడగానే వలపులను పండించగల తనకు మాని పేదరికం, మోటుతనంతో నిండిన మనిషితో పున్నమ్మ సంపర్కం పెట్టుకోవటం ఈ అవమానంతో అతని హృదయం బేజారవుతోంది. ఈ విషయంలో మౌనం యెంత కాలమో తనకు వరించ లేదు. ఒకసారి పరోక్షంగా ఆమెకు వినిపించేటట్లు అన్నాడు "ఈ మొగాళ్ళు మోసం చేస్తారు" ఇంకోసారి "ఒక్క ర్తే ఉంటావు ఇల్లు జాగ్రత్త" అన్నాడు. వేరొకసారి "ఎవరిని నేను లేనప్పుడు రానివ్వకు" అన్నాడు. ఆఫీసుకు వెళ్ళిపోతూ తన అడవి పువ్వు మీద రాలటానికి యెన్నో తుమ్మెదలు కొట్లాడుకోవటం గమనించాడు

ఆమె మనసు మెల్లగా మార్చాలన్న ప్రయత్నంతో ఒకసారి "పున్నమ్మా—నీవు లేకపోతే పిల్లల గతి చూడు" ఆమె జవాబు చెప్పకండా అలా తల దించుకునే ఉంది.

"మాట్లాడవేం?"

"నే నెక్కడికి వెళ్ళిపోతాను బాబూ!"

"అయితే యెందుకలా దిగులుగా ఉంటున్నావ్?"

"ఏంలేదు బాబూ"

"చూడు-ఇంకా చిన్నదానవు కాదు. మంచీ చెడు తెలుసుకొని మెసలాలి."

పున్నమ్మ చప్పున కళ్ళ నీరు తెచ్చుకుంది.

"ఏడవక, నిన్ను కష్టపెట్టడం నాకిష్టం లేదు."

"అమ్మగారే ఉంటే-" అంటూ ఇంక బెక్కుతూనే వంటిం ట్లోకి వెళ్ళిపోయింది.

ఈ మాట ఎన్నో అర్థాలు నిస్తుంది. అమ్మగారే ఉంటే ఇలాంటి చూపులతో మీరు నన్ను వేధించేవారా? అమ్మగారే ఉంటే వయసు వచ్చిందని నన్ను ఎవణ్ణో చూసి పెళ్ళి చేసే వారుకదా? అమ్మగారే ఉంటే నేనిలా పాడయ్యేదాన్నా? అమ్మగారే ఉంటే.... ఇలా యెన్నో ప్రశ్నలూ సమాధానాలతో తోటలో గడ్డిలో కూల బడిపోయాడు. కామంతో చీకటైన హృదయంలో అప్పుడప్పుడూ ఆత్మ వెలుగు పడుతోంది. ఆ వెలుగు కదలగానే మళ్ళీ చీకటి. ఆమెకు దగ్గర దగ్గర అవుతున్నాడు. మాటలు కలుపుతున్నాడు. ఆమెను చూసి నవ్వబోతున్నాడు. తాకబోతున్నాడు. ఎల్లప్పుడూ ఆమె గురించే ఆలోచిస్తున్నాడు. అడవిపూవు వాడిపోలేదు. అతని తృష్ణ చల్లారలేదు.

ఒకనాడు రాత్రి చిన్నపిల్ల నిద్దరనించి లేచి యేడుస్తోంది. ఏందుకో చెప్పదు. బహుశః తల్లి జ్ఞప్తికి వచ్చిందేమో? లేక తల్లి కలలో కనిపించిందేమో? అంతవరకు పున్నమ్మ గురించి ఆలో చిస్తూ నిద్దరపోని కనకరాజు ప్రక్కగది వేపు వెళ్ళి తలుపు తట్టాడు. పున్నమ్మ చిన్న పిల్లను భుజంమీద వేసుకొని వోదారుస్తూ తలుపు గడియ తీసింది. పిల్లను తీసుకొని ఇటు అటు కదులుతూ ఒక మూల తలదించి నిల్చున్న పున్నమ్మవేపే చూస్తున్నాడు. ఆమె తరగని శృంగారంతో ఒయ్యారంగా ఉంది. యౌవనం సెంటు లాగు ఘుమఘుమ మంటూ గుభాళిస్తోంది. ఒళ్ళంతా కళ్ళుచేసు కొని చూస్తుంటే అప్పుడప్పుడూ పైకెగసిన ఆమెకళ్ళు బెదరసాగి

నయ్. పిల్లను ఆమె చేతికి అందివ్వ బోయాడు. ఆమె అతనికి తగలకుండా అందుకుంది.

"పిల్లకు భయమేమో దీపం ఉంచి పడుకో" అన్నాడు.

మౌనంగా తల వూపింది, కాళ్ళు కట్టివేసినా అక్కడ నించి మర్యాదకు కదిలిపోయాడు. తిరిగి వచ్చినా కనకరాజుకు నిద్దర లేదు. వలపు ఒళ్ళంతాకుమ్మరిస్తోంది. వయసు వెనుకకు ప్రయాణం చేస్తోంది. ఒకసారి లేచి ప్రక్కగది వేపు వెళ్లాడు. అద్దం తలుపు గుండా తొంగి చూసాడు. పైన తిరుగుతున్న ఫేను గాలిలో పున్నమ్మ ఒళ్ళుమరచి నిద్దురపోతోంది. నీటిలో నిద్దరపోతున్న బలసిన బొంతచేపలా ఉంది. తను ఈదినా దానిని పట్టుకోలేడు. అతను గట్టుదాటని సముద్రంలా కట్టుబాటుతో ఉంటే వలపన్నలేడు. చూపులను ఆమె అవయవాలపై అప్పజెప్పిఅతను గుటకలుమింగసాగాడు రానురాను ఉప్పొంగి పోతున్న సముద్రంలా హృదయంనించి రక్తం పొంగసాగింది. ఆ హోరు తను వినలేక పోతున్నాడు. రావి ఆకులా వడవడ వణికిపోతూ తలుపు తట్టాడు. ఆమె చేప. నిద్దర భంగమైంది. చీర సర్దుకొని ప్రక్కకు తిరిగి పడుకుంది. పెద్ద నిట్టూర్చి మళ్ళీ తలుపు తట్టాడు.

పున్నమ్మ ఒక్కసారి తలెత్తి చూసింది. ప్రసరిస్తున్న కామ దృష్టికి అలాంటి చిరునవ్వే జతచేర్చాడు. ఆమె గాభరాపడింది. ఆమె పెదాలు కదిలాయి గానీ ఆ మాటలు అతనికి వినిపించలేదు. లేచి చప్పున దీపం ఆర్పేసింది. ఆమె యేమైందో అతనికి కనపడ లేదు. చీకటిలో ఆమెవైపు చూడలేని కళ్ళు అవమానంతో తనలోనికి చూసినయ్. ఆమె తనను అవమానించినందుకు నానా దుర్భా

షలు మనసులోనే అనుకున్నాడు. ఆ మరుచటి రోజు ఆమె పని పట్టిస్తాననుకున్నాడు. చెప్పినట్టు వినకపోతే యెలా వచ్చిందో అలానే పంపించాలని నిశ్చయించుకున్నాడు. ఆమెపై పగతీర్చుకొనే ఆలోచనలు అంతం కాకుండానే యెలాగో అఃస్యంగా మగత నిద్ర కప్పేసింది.

తెలివి వచ్చేసరికి కిటికీగుండా సూర్యరశ్మి పడుతోంది. ప్రక్కకు చూసాడు. టేబిలు మీద బెడ్ కాఫీ లేదు. చప్పున లేచి వంట ఇంటివేపు వెళ్ళాడు. అంగటికి రాగానే గేటు తలుపులు తెరిచి ఉన్నాయ్. గబగబా గేటు దగ్గరికి నడిచాడు. అడవిపూవే కాదు మొక్కతో యేదో పసుపు పీక్కొనిపోయింది. మూయని గేటుకు ఆనుకొని రెండోసారి పగిలిన హృదయాన్ని పట్టుకొని నిలుచుండి పోయాడు.

(భారతి జనవరి 65)